# ఆమ్లాలు - క్షారాలు

ప్రధానాంశాలు:

- ఆమ్ల, క్షారాల నిర్వచనం, వాటి తయారీ పద్ధతులు
- ఆమ్ల క్షారాల ధర్మాలు
- అర్హీనియస్ సిద్ధాంతం
- నీటి అయనీకరణం, అయనీకరణ లబ్ధం
- $P^H$ స్కేలు
- ఆమ్ల క్షారాల బలాలు
- తటస్థీకరణోష్ణం

**ఆమ్ల, క్షారాల నిర్వచనం, వాటి తయారీ పద్ధతులు:**

**ఆమ్లం:** ఆమ్లం అనే పదం 'ఎసిడస్' అనే లాటిన్ పదం నుంచి ఉద్భవించింది. ఎసిడస్ అంటే పుల్లని అని అర్థం. రుచికి పుల్లగా ఉండే రసాయన పదార్థాన్ని ''ఆమ్లం'' అంటారు.

**ఆమ్లాల తయారీ:** అలోహ ఆక్సైడ్‌లను నీటిలో కరిగించినపుడు ఆమ్లాలు ఏర్పడతాయి.

**ఉదా:** $SO_3 + H_2O \rightarrow H_2SO_4$ (సల్ఫ్యూరిక్ ఆమ్లం)

$CO_2 + H_2O \rightarrow H_2CO_3$ (కార్బోనిక్ ఆమ్లం)

$P_2O_5 + 3H_2O \rightarrow 2H_3PO_4$ (ఫాస్ఫారిక్ ఆమ్లం)

**క్షారం:** సబ్బులా జారుడు స్వభావాన్ని కలిగి ఉండి.. ఆమ్లంతో కలిసి లవణాలు ఏర్పరచే పదార్థం క్షారం.

**క్షారాల తయారీ:** లోహ ఆక్సైడ్‌లను నీటిలో కరిగించినపుడు క్షారాలు ఏర్పడతాయి.

**ఉదా:** $Na_2O + H_2O \rightarrow 2NaOH$ (సోడియం హైడ్రాక్సైడ్)

$CaO + H_2O \rightarrow Ca(OH)_2$ (కాల్షియం హైడ్రాక్సైడ్)

$MgO + H_2O \rightarrow Mg(OH)_2$ (మెగ్నీషియం హైడ్రాక్సైడ్)

## ఆమ్ల క్షారాల ధర్మాలు

1. ఆమ్ల, క్షారాలు సూచికలు రంగును కింది విధంగా మారుస్తాయి.

| సూచిక | ఆమ్లం | క్షారం |
|---|---|---|
| లిట్మస్ కాగితం | నీలిలిట్మస్ ఎర్రగా మారుతుంది | ఎర్ర లిట్మస్ నీలిగా మారుతుంది |
| మిథైల్ ఆరెంజ్ | ఎరుపు | పసుపు |
| ఫినాఫ్తలీన్ | మార్పులేదు | గులాబీ |

2. ఆమ్లం, క్షారం పరస్పరం చర్య పొంది లవణం, నీరు ఏర్పరుస్తాయి.

$HCl + NaOH \rightarrow NaCl + H_2O$

$2HCl + Ca(OH)_2 \rightarrow CaCl_2 + 2H_2O$

3. ఆమ్లాలు లోహాలతో చర్య పొంది హైడ్రోజన్ వాయువును విడుదల చేస్తాయి.

$Zn + H_2SO_4 \rightarrow ZnSO_4 + H_2\uparrow$

4. లోహ ఆక్సైడ్‌లతో ఆమ్లాలు చర్య పొంది లవణం, నీరు ఏర్పరుస్తాయి.

$ZnO + 2HNO_3 \rightarrow Zn(NO_3)_2 + H_2O$

5. క్షారాలు వేడి చేసినపుడు లోహ ఆక్సైడ్‌లను, నీటిని ఏర్పరుస్తాయి.

$Ca(OH)_2 \rightarrow CaO + H_2O$

6. ఆమ్ల జల ద్రావణాలు, క్షార జల ద్రావణాలు విద్యుద్వాహకతను ప్రదర్శిస్తాయి.

## అర్హీనియస్ సిద్ధాంతం

1887లో స్వీడన్ దేశీయుడైన అర్హీనియస్ ఆమ్ల క్షార సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు.

ఈ సిద్ధాంతం ప్రకారం:

**ఆమ్లం:** జల ద్రావణంలో $H^+$ అయాన్లను ఇచ్చే పదార్థాలు ఆమ్లాలు.

**ఉదా:** $HCl \rightarrow H^+ Cl^-$

$HNO_3 \rightarrow H^+ + NO3^-$

**క్షారం:** జల ద్రావణంలో $OH^-$ అయాన్లను ఇచ్చే పదార్థాలు క్షారాలు.

**ఉదా:** $NaOH \rightarrow Na^+ + OH^-$

$Mg(OH)_2 \rightarrow Mg^{2+} + 2OH^-$

**అర్హీనియస్ సిద్ధాంతంలోని లోపాలు:**

1. ఈ సిద్ధాంతం నీటిలో కరిగే పదార్థాల గురించి మాత్రమే వివరిస్తుంది.
2. నీటిలో కరగని, ఇతర ద్రావణిల్లో కరిగే పదార్థాల స్వభావాన్ని గురించి ఈ సిద్ధాంతం వివరించలేదు.
3. $CO_2$, $SO_2$ వంటి కొన్ని పదార్థాలు స్వతహాగా $H^+$ అయాన్లను కలిగి ఉండవు. కాని ఇవి ఆమ్ల స్వభావాన్ని ప్రదర్శిస్తాయి. ఇలాంటి పదార్థాల గురించి ఈ సిద్ధాంతం వివరించలేదు.
4. MgO, CaO వంటి కొన్ని పదార్థాలు స్వతహాగా $OH^-$ అయాన్లను కలిగి ఉండవు. కాని ఇవి క్షార స్వభావాన్ని ప్రదర్శిస్తాయి. ఇలాంటి పదార్థాల గురించి ఈ సిద్ధాంతం వివరించలేదు.
5. ఇటీవలి ప్రయోగాలు $H^+$ అయాన్లకు స్వతంత్ర ప్రతిపత్తి లేదని నిరూపించాయి. అంటే.. ఆమ్లాలు $H^+$ అయాన్లను ఇవ్వడం అనే ప్రసక్తి ఉండదు.

## నీటి అయనీకరణం

నీరు అతి తక్కువ పరిమాణంలో అయనీకరణం చెంది $H^+$, $OH^-$ అయాన్లను ఇస్తుంది. 25°C సమతాస్థితి వద్ద $H^+$ అయాన్ల గాఢత $[H^+]$, $OH^-$ అయాన్ల గాఢత $[OH^-]$ కు సమానం. ఈ విలువ $10^{-7}$ మోల్ అయాన్లు/లీటర్

### నీటి అయనీకరణ లబ్ధం:

ఒక మోల్ నీటిలో ఉన్న $H^+$, $OH^-$ అయాన్ల గాఢతల లబ్ధాన్ని నీటి అయనీకరణ లబ్ధ ($K_w$) అంటారు.

$$K_w = [H^+] \times [OH^-]$$

25°C వద్ద నీటి అయనీకరణ లబ్ధం ($K_w$) విలువ $1.0 \times 10^{-14}$ మోల్ అయాన్$^2$/లీటర్$^2$.

నీటి అయనీకరణ లబ్ధం ఉష్ణోగ్రతపై ఆధారపడి ఉంటుంది.

## $P^H$ స్కేలు

$H^+$ అయాన్ల గాఢతలను తేలికగా లెక్కించడానికి సోరెన్సన్ అనే శాస్త్రవేత్త $P^H$ అనే పదాన్ని పరిచయం చేశాడు.

$H^+$ అయాన్ గాఢత రుణ సంవర్గమానాన్ని $P^H$ అని నిర్వచిస్తారు.

$$P^H = -\log [H^+]$$

$P^H < 7$ అయితే ఆమ్లం

$P^H = 7$ అయితే తటస్థ ద్రావణం

$P^H > 7$ అయితే క్షారం




## ఆమ్ల క్షారాల బలాలు

- 100% అయనీకరణం చెందిన ఆమ్లాలను బలమైన ఆమ్లాలు అంటారు. **ఉదా:** HCl
- 100% అయనీకరణం చెందిన క్షారాన్ని బలమైన క్షారం అంటారు. **ఉదా:** NaOH
- 100% కంటే తక్కువ అయనీకరణం చెందిన ఆమ్లాన్ని బలహీన ఆమ్లం అంటారు. **ఉదా:** $CH_3COOH$
- 100% కంటే తక్కువ అయనీకరణం చెందిన క్షారాన్ని బలహీన క్షారం అంటారు. **ఉదా:** $NH_4OH$

### తటస్థీకరణోష్ణం:

ఒక మోల్ బలమైన ఆమ్లం, ఒక మోల్ బలమైన క్షారంతో చర్య జరిపినపుడు వెలువడే ఉష్ణాన్ని 'తటస్థీకరణోష్ణం' అంటారు.

$$NaOH + HCl \rightarrow NaCl + H_2O + 13.7 \text{ కి.కె/మోల్}$$

ఒక బలమైన ఆమ్లం, బలహీన క్షారం లేదా బలమైన క్షారం, బలహీన ఆమ్లం, బలహీన ఆమ్లం బలహీన క్షారాల మధ్య చర్య జరిగినప్పుడు తటస్థీకరణోష్ణం విలువ 13.7కి.కె/మోల్ కంటే తక్కువ ఉంటుంది.

**Ex:** $CH_3COOH + NaOH \rightarrow Na^+ + CH_3COOH^- + H_2O +$ 13.4 కి.కె/మోల్

## అదనపు సమాచారం

ఆమ్లాల లభ్యతను బట్టి రెండు రకాలు. అవి

1. **ఆర్గానిక్ ఆమ్లాలు (జంతువులు లేదా చెట్ల నుంచి వచ్చేవి)**

**ఉదా:** ఎసిటిక్ ఆమ్లం(వినిగర్)
సిట్రిక్ ఆమ్లం(నిమ్మ)
లాక్టిక్ ఆమ్లం(పాలు)
టార్టారిక్ ఆమ్లం(చింతపండు)
మాలిక్ ఆమ్లం(ఆపిల్)
యూరిక్ ఆమ్లం(యూరిన్)

2. **ఇనార్గానిక్ ఆమ్లాలు లేదా కృత్రిమ ఆమ్లాలు(భూమి ఖనిజాల నుంచి తయారు చేసేవి)**

**ఉదా:** $HCl$, $H_2SO_4$, $HNO_3$, $H_2CO_3$ etc.

### 3. నిత్యజీవితంలో ఉపయోగించే క్షారాలు:

అంటాసిడ్, టూత్ పేస్ట్, సబ్బు ద్రావణం, సర్ఫ్ మొదలైనవి.

## ముఖ్యమైన ప్రశ్నలు

### 4 మార్కులు

1. అర్హీనియస్ ప్రకారం ఆమ్లం, క్షారం, తటస్థీకరణాలను నిర్వచించండి? ఈ సిద్ధాంతంలోని లోపాలను పేర్కొనండి?
2. బలమైన ఆమ్లం, బలమైన క్షారం, బలహీన ఆమ్లం, బలహీన క్షారాలను నిర్వచించి.. ఒక్కొక్క దానికి ఉదాహరణలివ్వండి?
3. తటస్థీకరణోష్ణం అంటే ఏమిటి? ఉదాహరణ ఇవ్వండి? బలమైన ఆమ్ల క్షార చర్యకు దీని విలువ ఎంత?

### 2 మార్కులు

1. 0.002M, $HCl$ $P^H$ విలువ ఎంత?
2. నీటి అయనీకరణ లబ్ధం అంటే ఏమిటి? దీని విలువను లెక్కించండి?
3. అర్హీనియస్ ఆమ్ల క్షార సిద్ధాంతాన్ని రాయండి?

### 1 మార్కు

1. 0.001 M ద్రావణపు $P^H$ విలువ ఎంత?
2. $P^H$ అంటే ఏమిటి?

3. తటస్థీకరణోష్ణం అంటే ఏమిటి?

## బిట్స్

1. నీటి అయనీకరణ లబ్ధం ________
2. $K_w$ విలువ ________తో పాటు మారుతుంది.
3. $P^H$ 7 కంటే ఎక్కువగా ఉన్న మానవ శరీర ద్రవం ________
4. ఆమ్లం నీలి లిట్మస్‌ను ________గా మారుస్తుంది.
5. క్షార ద్రావణంలో ఫినాప్తలీన్ సూచిక రంగు ________
6. $P^H$=8 గా ఉన్న ద్రావణంలో $H^+$ అయాన్ల గాఢత ________
7. ఒక ద్రావణపు $P^H$ విలువ 10 ఐతే దాని $(H^+)$ విలువ ______
8. ఆమ్ల ద్రావణంలో మిథైల్ ఆరెంజ్ సూచిక రంగు ________
9. $P^H$>7అయితే ఆ ద్రావణం ________
10. స్వచ్ఛమైన నీటి $P^H$ విలువ ________

## జవాబులు

1. $1.0 \times 10^{-14}$ మోల్ అయాన్$^2$/లీటర్$^2$
2. ఉష్ణోగ్రత
3. రక్తం
4. ఎరుపు
5. గులాబి
6. $10^{-8}$
7. $10^{-10}$
8. ఎరుపు
9. క్షారం
10. 7